19వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

మంగళవారం 11 ఫిబ్రవరి 2025 పేజీలు : 8

## ప్రజలు ఫస్ట్... నాయకులు నెక్స్ట్.. : మంత్రి శ్రీధర్ బాబు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 10 :** ప్రజలు ఫస్ట్ నాయకులు నెక్స్ట్ అని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నాయకులను హెచ్చరించారు. కాగా మంత్రి శ్రీధర్ బాబు నియోజకవర్గానికి రాగానే నాయకులు చుట్టుముట్టేవారు. దీంతో సామాన్య ప్రజలు చాలామంది మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం మంథని నియోజకవర్గంలోని ఆయన స్వగృహంలో మంత్రి శ్రీధర్ బాబు రాగానే నాయకులు చుట్టుముట్టారు. దీంతో మంత్రి శ్రీధర్ బాబు ముందు సామాన్య ప్రజలు వారి స్థితిగతులు బాధలు తెలుసుకోవాలి అని తెలిపారు. నాయకులు సామాన్య ప్రజల అనంతరం కలవాలని అంతవరకు కార్యాలయంలో వేచి చూడాలని వారిని సూచించారు. దీంతో మంత్రి శ్రీధర్ బాబు ఓపిక కూర్చుండి ఒక్కొక్కరి వినతిపత్రాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి తన వ్యక్తిగత చంద్రశేఖర్ కు అప్పగించి తమ లెటర్లు ఇవ్వాలని సూచించారు. దీంతో సామాన్య ప్రజల్లో ఆనందాలు వెల్లి విరిస్తున్నాయి. ఓపికగా మంత్రి శ్రీధర్ బాబు తమ సమస్యలను విని పరిష్కార మార్గం చూపించడంతో ప్రజలు ధన్యవాదాలు మంత్రి శ్రీధర్ బాబుకు తెలిపారు. ఎవరు కూడా హైదరాబాద్కు రాకూడదని తాను మంథనిలో అందుబాటులోకి ఉంటానని శ్రీధర్ బాబు అన్నారు.













- కమిషనర్లపై, సిబ్బందిపై అవినీతి ఆరోపణలు
- అవినీతి నిరోధక శాఖ దాడులు
- ముగ్గురు చైర్మన్ల మార్పులు
- అభివృద్ధి పనులు అసంపూర్ణంప్రత్యేక పాలనలో గాడిలో పడేనా..?

# పాలకవర్గ పదవీ కాలం...
# అవినీతి ఆరోపణల పర్వం

**జగిత్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 8 (చురకలు ) :** జగిత్యాల మున్సిపల్ పాలక వర్గ పదవీకాలం జనవరి 26తో ముగిసింది. కాగా ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలే ఎక్కువన్న ఆరోపణలు పాలకవర్గం పై రాగా, రాజకీయ ఒత్తిళ్లు పనిచేశాయన్న విమర్శలు వినిపించాయి. ఈ ఆరోపణల

-2లో

### ప్రజలకు ఇచ్చిన
## హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

- బీసీల సంఖ్యను తక్కువగా చూపడం శోచనీయం
- కేసీఆర్ పాలన ఐఫోన్ లా ఉంటే... రేవంత్ రెడ్డి పాలన చైనా ఫోన్ లా ఉంది
- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 10 :** ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంఖ్యను తక్కువగా చూపడం శోచనీయమని, కేసిఆర్ పాలన ఐఫోన్ లా ఉంటే... రేవంత్ రెడ్డి పాలన చైనా ఫోన్ లా ఉందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే వరకు ఉద్యమం ఆగదని, రాజకీయ కక్షతో రైతులకు రేవంత్ సర్కార్ నీళ్లు ఇవ్వడం లేదని,రాజకీయ కక్షలు పక్కన పెట్టి అభివృద్ధి, సంక్షేమం పై దృష్టి పెట్టాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పాలన ఐఫోన్ లా ఉంటే... రేవంత్ రెడ్డి పాలన చైనా ఫోన్ లా ఉందని, ఐఫోన్ కు, చైనా ఫోన్ కు ఎంత తేడా ఉంటదో... కేసీఆర్ కు, రేవంత్ రెడ్డికి అంత తేడా ఉందన్నారు. మాటలు చెప్పి బీసీల ఓట్లు

2లో

## బిజెపితో కేసీఆర్ రూపాయి కారు ఒప్పందం

- ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి
- పట్టభద్రులకు అండగా కాంగ్రెస్
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్..రాష్ట్ర మంత్రులు ఉత్తమ్, పొన్నం, శ్రీధర్ బాబు, జూపల్లి



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 10 :** పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీతో కేసీఆర్ లోపాయికార ఒప్పందం కుదుర్చుకున్నారని.. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అన్నీ కోణాల్లో నుంచి పరిశీలించి సత్తా ఉన్న నరేందర్ రెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేశామని తెలిపారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్స్ అభ్యర్థి వుట్కూరి నరేందర్ రెడ్డి కరీంనగర్ లో నామినేషన్ దాఖలు చేశారు. భారీ ఎత్తున ర్యాలీ చేపట్టగా.భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళల కోలాటాలు, డప్పుచప్పుళ్లు, ఒగ్గుడోలు కళాకారుల నృత్యాల నడుమ ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది... ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు అండగా నిలుస్తోందని తెలిపారు..కాంగ్రెస్ అంటే కమిట్మెంట్ పార్టీ అని కొనియాడారు. కేసీఆర్ ఏడాదికి 5వేల ఉద్యోగాలిస్తే... సీఎం రేవంత్ రెడ్డి నెలకు 5వేల ఉద్యోగాలు ఇస్తున్నారని

2లో

## షబ్ ఏ బరాత్‌కు వసతులు కల్పించాలి



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 10 :** ఈనెల 14న జరగమున్న షబ్ ఏ బరాత్ కు వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం పట్టణ ఎంఐఎం అధ్యక్షుడు యూనుస్ నదీం ఆధ్వర్యంలో నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంఐఎం నాయకులు మాట్లాడుతూ ఖబ్రస్తాన్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, అన్ని మసీదుల వద్ద మౌలిక వసతులు కల్పించాలని, అవసరమైన లైట్లు. నీటి సౌకర్యం కల్పించాలని, ఉస్మాన్పుర ఖబ్రస్తాన్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ను మరోచోటుకు మార్చాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఐఎం నాయకులు అఫ్జల్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**చురకలు విలేకరి, మెట్ పల్లి, ఫిబ్రవరి 10 :** మెట్ పల్లి పట్టణ ప్లంబింగ్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా సోమిడి మహేందర్, ఉపాధ్యక్షుడు ఎస్.కె. అలీమొద్దీన్, కోశాధికారిగా గజ్జె యాదగిరి, న్యాయ సలహాదారులుగా ఎగ్యారపు వెంకటేశ్వర్లు, సలహాదారులుగా ఐలయ్య, శ్రీనివాస్,కార్యవర్గసభ్యులుగా పవన్, జాహిద్, షకీల్, శ్రీనివాస్, ప్రవీణ్, అస్లాం, ముఖీజ్లు ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

## మహిళ హత్య కేసులో నిందితునికి జీవితఖైదు

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 10 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ పోలీస్ స్టేషన్లో 2021లో నమోదైన మహిళ హత్య కేసులో నిందితునికి జీవితఖైదు విధిస్తూ జిల్లా న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. వెల్గటూర్ మండలంలోని పాతగూడురుకు చెందిన దేవయ్యకు ధర్మారం మండలం పత్తిపాక గ్రామానికి చెందిన లతతో వివాహం జరుగగా, దేవయ్య ఉపాధి నిమిత్తం గల్ఫు వెళ్లాడు. పాతగూడురు గ్రామానికి చెందిన బోయిని రమేష్ 2021 జనవరి 7న లత ఇంటికి వచ్చి ఆమెతో గొడవ పడగా, రమేష్ లతను గొంతు నులిమి హత్య చేశాడు. మృతురాలి తల్లి కనుక మనవ్వ ఫిర్యాదుతో వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టు హాజరుపర్చారు. కేసును విచారించి న్యాయమూర్తి నీలిమ నిందితునికి జీవితఖైదు, రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితునికి శిక్ష పడడంలో కృషి చేసిన పిపి మల్లికార్జున్, విచారణాధికారులు ప్రేమ్‌కుమార్, కిషోర్, రాంచంద్రరావు, కోటేశ్వర్, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్, సిఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, సిఎంఎస్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## బిజెపితో కేసీఆర్...

**మొదటి పేజీ తరువాయి..** చెప్పారు. కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ రూపాయి కూడా తీసుకు రాలేదని ఆరోపించారు. బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై నలుగురు ఎంపీలు సమాధానం చెప్పాలన్నారు.కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ . గ్రాడ్యుయేట్లకు కాంగ్రెస్ ఎంతో మేలు చేసిందని... ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నాలుగు జిల్లాల్లో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆనాటి ప్రభుత్వాన్ని జీవన్ రెడ్డి గడగడలాడించారని చెప్పారు.పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పట్టభద్రుల విద్యావ్యవస్థను మార్పు చేస్తున్నామని... మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ అర్బన్ నక్సలైట్ల ను ప్రోత్సహిస్తుందంటూ బీజేపీ చేసిన ఆరోపణలను తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామిక పార్టీ అని గుర్తుచేశారు. మతతత్వ బీజేపీని ఓడించాలని కోరారు.ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తన విజయాన్ని కాంగ్రెస్ పార్టీకి గిఫ్ట్ గా అందిస్తాని... ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి అన్నారు. జీవన్ రెడ్డి తనకు రోల్ మోడల్ అని... ఆయన స్ఫూర్తితో పని చేస్తానని తెలిపారు. సింగరేణి లో మైనింగ్, ఆదిలాబాద్ లో గిరిజన యూనివర్సిటీ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ ఇప్పిస్తానని చెప్పారు. బీజేపీ మతతత్వ పార్టీ అని... బీజేపీ అభ్యర్థి అజ్ఞాని అని ఆరోపించారు. ఈ ఎన్నికలు జ్ఞానికి అజ్ఞానికి జరుగుతున్న పోటీయేనని చెప్పారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు పాల్గొన్నారు

# పాలకవర్గ పదవీకాలం... అవినీతి ఆరోపణల పర్వం

**మొదటి పేజీ తరువాయి..** నేపథ్యంలో ఒకే టర్మ్ లో 16 మంది కమీషనర్లు మారారు. ముగ్గురు చైర్పర్సన్లు పని చేశారు. 2019 లో జగిత్యాల మున్సిపాలిటీని అప్పటి టీఆర్ఎస్ పార్టీ గెలుచుకుంది. దీంతో భోగ శ్రావణి చైర్మన్ గా పదవి చేపట్టారు. మూడేళ్ళ తర్వాత రాజకీయ విభేదాలతో చైర్మన్ పదవికి భోగ శ్రావణి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో అనేక రాజకీయ మలుపులు తర్వాత అడువాల జ్యోతి చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టారు. బిఆర్ఎస్ కు చెందిన ఆమె కాంగ్రెస్ లో చేరారు. అనూహ్యంగా బిఆర్ఎస్ కొంత కాలం కాంగ్రెస్ పాలన సైతం కనిపించినట్లయ్యింది.

**ఐదేళ్లలో 16 మంది కమిషనర్లు....**

ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలే ఎక్కువన్న ఆరోపణలను పని చేసిన 16 మంది కమిషనర్లు, ముగ్గురు మున్సిపల్ చైర్మన్లు కట్టడి చేయలేకపోయారనే అపవాదును మూటగట్టుకున్నారు. మొట్టమొదట కమిషనర్ గా లచ్చిరెడ్డి పనిచేశారు. ఆ తర్వాత 2020 లో పూర్తిస్థాయి కమిషనర్ గా జయంత్ రాగా కొన్ని రోజులకే లాంగ్ లీవ్ పెట్టి వెళ్ళిపోయారు. ఆ తర్వాత కోరుట్ల కమిషనర్ ఆయాజ్ కు, ఆతర్వాత కొంత కాలానికి అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ కి అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గత మున్సిపల్ పాలనలో పని చేసిన మారుతీ ప్రసాద్ కు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించారు. ఆయన కాలంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేయడంతో ఏడాది తర్వాత బదిలీపై వెళ్లారు. 2021 లో జగిత్యాల స్థానిక అధికారి అయిన ఈడి ఎస్సీ కార్పొరేషన్ కుందారపు లక్ష్మీ నారాయణ కు అదనపు బాధ్యతలు అప్ప జెప్పారు. ఆతర్వాత స్వరూప రాణి కి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించారు. ఆమె కూడా పాలక వర్గంతో పొసగక లాంగ్ లీవ్ పెట్టి వెళ్లిపోయారు. ఆ తర్వాత గోపు గంగాధర్ కమిషనర్ గా వచ్చారు. గంగాధర్ హయాంలో మున్సిపాలిటీలో పలు అవినీతి అక్రమాలపై ఆంధ్రప్రభలో వచ్చిన కథనాలు, పలువురు కౌన్సిలర్లు అప్పటి కలెక్టర్ రవి కి ఫిర్యాదు చేయడంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మకరందు వీటి వివరాలు కావాలని గంగాధర్ ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కమిషనర్ గంగాధర్ లాంగ్ లీవ్ పై వెళ్లడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది..2022 లో జగిత్యాలలో నే పనిచేస్తున్న డి.ఈ. రాజేశ్వర్ కు ఇంచార్జ్ కమిషనర్ గా నియమించారు. 2023 లో వెటర్నరీ జిల్లా అధికారిగా, జిల్లా సంక్షేమ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జగిత్యాల పట్టణ వాసి బో నగిరి నరేశ్ కు కమిషనర్ గా బాధ్యతలు అప్పగించడం, పని చేసిన కాలంలో పట్టణములో విమర్శలు, ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత అనిల్ బాబు పూర్తి స్థాయి కమిషనర్ గా వచ్చారు. వివల్ టి భూ ఆరోపణలతో ఆయన సస్పెండ్ అయ్యారు.2024 లో రాయికల్ ఎం.పి.డి.ఓ. చిరంజీవి కి బాధ్యతలు అప్పగించారు. కొన్ని రోజుల తర్వాత సమ్మయ్య రెగ్యులర్ కమిషనర్ గా నియమితులయ్యారు. ఆయన సైతం వివిధ ఆరోపణలతో సరెండర్ కాగా రాయికల్ ఎంపిడిఓకే కమిషనర్ గా బాధ్యతలు అప్పగించారు.

**అక్రమాలు అనేకం.....**

ఐదేళ్ళ పాలనలో అక్రమాలు అనేకం కాగా ఎనిమిది మంది జైలుకు వెళ్ళాల్సి వచ్చింది. 2020 లో జగిత్యాల అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారి బాలానంద స్వామి, అవుట్ సోర్సింగ్ఉద్యోగి రాము బిల్డింగ్ పర్మిషన్ కోసం లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు.2021 లో మున్సిపల్ రెవెన్యూ అధికారి అనూప్, బిల్ కలెక్టర్ అనిల్ పై ఏ.సి.బి. సూమోటోగా కేసు నమోదు చేయగా సస్పెండ్ అయ్యారు. భూ వ్యవహారంలో కమిషనర్ తో సహా మరో ఇద్దరు అరెస్టయ్యారు. డీజిల్ వాహనాల మరమ్మత్తుల్లో వాటాల కోసం ఒత్తిడి మూలంగా వచ్చిన ప్రతి శానిటరీ ఇన్స్పెక్టర్ కొంత కాలమే కష్టంగా పని చేసి సెలవుపై వెళ్లడం ఆనవాయితీగా మారింది. టౌన్ ప్లానింగ్ విభాగం, రెవెన్యూ తదితర ఏ విభాగమైనా ముడుపులు లేనిదే ఏ పని జరగలేదని ఆరోపణలు వినిపించగా 2023 లో టౌన్ ప్లానింగ్ విభాగంలో, రెవెన్యూ శానిటేషన్ సెక్షన్ లో అవకతవకలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారు. వాహన కొనుగోళ్ళు, పొరుగు సేవల సిబ్బంది నియామకాల్లో అన్నిట్లో వసూళ్ల ఆరోపణలు. మొదట 35 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించారు. మధ్యలో 14 మందిని, ఇటీవల 15 మందిని నియమించారు. ఒక్కొక్కరి వద్ద రూ.2 లక్షల వరకు వసూళ్లు చేశారన్నది బహిరంగ రహస్యమే. స్థానికసంస్థల అదనపు కలెక్టర్ కు సైతం ఈ వసూళ్లపై కొందరు కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు.

**కొందరు కౌన్సిలర్లపై సైతం అవినీతి ఆరోపణలు.....**

కోరుట్ల మున్సిపాలిటీ పరిధిలో ఇల్లు నిర్మిస్తున్న ఓ వ్యక్తిని సంబంధించిన వార్డు కౌన్సిలర్ డబ్బులు డిమాండ్ చేసిన ఘటన లో పోలీసులు ఆ కౌన్సిలర్ ను అరెస్ట్ చేసి కేసు పెట్టారు. అయినప్పటికీ జగిత్యాల బల్దియాలో కొందరు కౌన్సిలర్లు కక్కుర్తి పనులు మానలేదు. ఇండ్లు కట్టుకునే వ్యక్తుల వద్ద కొందరు కౌన్సిలర్లు బలవంతంగా డబ్బుల వసూళ్లకు పాల్పడినట్లు, వారికి టౌన్ ప్లానింగ్ అధికారులు సహకరించినట్లు ఆరోపణలు వినిపించాయి. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం అధికారులపై, ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు.

**అభివృద్ధికి తిలోదకాలు..**

జగిత్యాల పట్టణ అభివృద్ధి కోసం ఐదేళ్లగా టి.యూ.ఎఫ్.డి.సి.కింద 3 విడతల్లో రూ.75 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో 50 శాతం మాత్రమే ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేశారు. రూ.34,59 కోట్లకు సంబంధించిన పనులు అసంపూర్తిగా మిగులగా, మొదటి విడతలో రూ. 2.20 కోట్లతో సి.సి.రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు ప్రారంభమునకు నోచుకోలేదు. రెండో విడతలో రూ.2.39 కోట్లతో బీ.టి.రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని భావించిన టెండర్లు పూర్తి కాలేదు. పట్టణములో దాదాపు రూ.40 లక్షలు వెచ్చించి 8 మినీ పార్కులు ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతానికి ఒక్క మొక్క లేదు. అలాగే రూ.40 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ నెల రోజులు పని చేయక ముందే మూలకు పడి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోలేదు. పట్టణములో రూ.10 లక్షలు వెచ్చించి మరుగుదొడ్లు నిర్మించినా నిరుపయోగంగానే ఉన్నాయి. రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన సమీకృత మార్కెట్ పూర్తి కాక ముందే 15 నెలల కిందట ప్రారంభించినా వినియోగం లోకి రాక పోగా మరో రూ.25 లక్షలు వెచ్చించారు.రూ.5 కోట్ల తో గ్రేవ్ యార్డులు, కమ్యూనిటీ భవనాలు నిర్మించాల్సి ఉండగా వీటికి టెండర్లు నిర్వహించ లేదు. ఐదేళ్ల పాలనలో అభివృద్ధి అధ్వాన్నంగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రత్యేకాధికారి పాలనలో బల్దియా గాడిలో పడేనా... ?**

పాలక వర్గం పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన మొదలైన నేపథ్యంలో అన్ని మున్సిపాలిటీల్లో ప్రత్యేకఅధికారుల పాలనలో కనీస సౌకర్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అసంపూర్తిగా పాలక వర్గం వదలి వేసిన అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాకు చెందిన గతంలో వలే స్థానిక నివాసులైన అధికారులు, ఎం.పి.డి.ఓ.లు, వెటర్నరీ, డి. ఈ అధికారులు కాకుండా గత కలెక్టర్ శరత్ వలె పాలనలో అనుభవం ఉన్న రెవెన్యూ డివిజనల్ అధికారులను జగిత్యాల, కోరుట్లమెట్ పల్లి మున్సిపల్ కమిషనర్లుగా, మిగితా రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో సైతం వేరే మండలం అధికారి ని కాకుండా ఆ మండలంలోనే పని చేస్తున్న తహశీల్దార్లను అదనపు బాధ్యతలతో నియమిస్తే పాలన గాడిలో పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రజలకు ఇచ్చిన....

**మొదటి పేజీ తరువాయి..** వేయించుకొని సీఎం రేవంత్ రెడ్డి బూరడి కొట్టించారన్నారు. ఏ కులంలో ఎంత జనాభా ఉన్నారో లెక్కలు ఎందుకు బయటపెట్టడం లేదని,తూతూమంత్రంగా మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంఘాలతో సమావేశం పెట్టారని, స్వయంగా ముఖ్యమంత్రి ఎందుకు సమావేశమవ్వడం లేదని ప్రశ్నించారు. బీసీ ఉద్యమం చేస్తున్న నాయకులతో ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం బీసీలను అవమానించడమేనని, బీసీ కుల సంఘాలతో ముఖ్యమంత్రి చర్చలు జరపాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకు ఉద్యమం ఆగదని, మరో తెలంగాణ పోరాటం తరహా పోరాటానికి బీసీలంతా సిద్ధంగా ఉండాలన్నారు. తప్పుడు జనాభా లెక్కలు చెప్పడంతో బీసీ సమాజం అట్టుడుకుతోందని, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే బీసీ కుల సంఘాలతో చర్చలు జరపాలని, 52 శాతం బీసీలు ఉన్నారని 2014లోనే కేసీఆర్ లెక్క తేల్చారని, లెక్కపెట్టడం కూడా రాని రేవంత్ రెడ్డి సర్కారు తప్పుడు లెక్కలు చెబుతోందని, బీసీల సంఖ్యను తక్కువ చూపించడం శోచనీయమన్నారు.ఈ తప్పుడు లెక్కలు చెప్పి రాహుల్ గాంధీ పార్లమెంటును తప్పుదోవపట్టించారని, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి బిల్లు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచించిందని, ఎండిపోయిన పొలాలను చూపిస్తూ రైతులు బాధపడుతున్నారని,ఎండిన పంటపొలాలను చూస్తుంటే కన్నీళ్లు వచ్చే పరిస్థితి ఉందన్నారు. కేసీఆర్ పై అక్కసుతో మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగించడం లేదని, రైతులను నీళ్లంచే తెలివి లేదు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, రాజకీయ కక్షను పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం నీళ్లను విడుదల చేయాలన్నారు. ఆడపిల్లలు స్కూటీలు, మహిళలకు రూ.2500 ఏమయ్యాయని, మహిళలను చిన్నచూపు చూస్తున్న రేవంత్ రెడ్డికి కాలం గుణపాఠం చెబుతుందన్నారు. రేవంత్ రెడ్డి తప్పుల ను ప్రజలు లెక్కిస్తున్నారు.. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్ లో చేరారని, అయినా కూడా మనోధైర్యం తో కార్యకర్తలు చెక్కుచెదరలేదని, ఉప ఎన్నిక వస్తే జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోతుందన్నారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, నాయకులు ఓరుగంటి రమణారావు, అమీన్ ఉల్ హసన్, గట్టు సతీష్, పాల్గొన్నారు.

# యూపిఎస్‌పై యుద్ధభేరి విజయవంతం చెయ్యాలి

**-ఓ పీ ఎస్ ను పునరుద్ధరించాలి**

**-టి ఎస్ సి పి ఎస్ ఈ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ కుమార్**



**చురకలు విలేఖరి,ధర్మపురి, ఫిబ్రవరి, 10 :** ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయబోతున్న ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్) విధానం కు వ్యతిరేకంగా మార్చ్ 2 వ తేదీన ధర్నా చౌక్ ,హైదరాబాద్ లో జరిగే యూ పి ఎస్ పై యుద్ధభేరి ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రి బ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ కుమార్ కోరారు. ధర్మపురి పట్టణం లో గోడ పత్రిక ఆవిష్కరించారు ఈ సందర్భంగా మ్యాన పవన్ కుమార్ మాట్లాడుతూ సీపీఎస్ వద్దంటూ పాత పెన్షన్ కొరకు రాష్ట్రవ్యాప్తంగా దశాబ్ద కాలంగా ఉద్యోగ ఉపాధ్యాయులు పోరాటం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం కొత్తగా యూపీఎస్ పేరుతో ఉద్యోగుల భవిష్యత్తును కార్పొరేట్లకు తాకట్టు పెడుతుందని దీనివల్ల ఉద్యోగుల జీవితాలు మరింత దుర్భరం అవుతాయనీ ఆందోళన వ్యక్తం చేశారు యూపీఎస్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలనీ ఇది యూనిఫైడ్ పెన్షన్ స్కీం కాదని యూస్ లెస్ పెన్షన్ స్కీం అని విమర్శించారు. ఉద్యోగి దాచుకున్న డబ్బుల నుండే పెన్షన్ ఇవ్వడం అంటే ఉద్యోగి తనకు హక్కుగా రావాల్సిన పెన్షన్ ను డబ్బులతో కొనుకోలు చేసినట్లు అవుతుందని వెంటనే ఏలాంటి చందా చెల్లించకుండానే సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగికి 50% పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలని కోరారు తెలంగాణలో వచ్చేనెల రెండున హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ లో యూ పి ఎస్ పై యుద్ధభేరికి రాష్ట్రంలోని రెండు లక్షల యాభై వేల సి పి ఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## టియుడబ్ల్యుజె హెచ్ 143 నూతన కార్యవర్గం

**-నియామకం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా గంగుల రాంగోపాల్**









**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 10 :** జగిత్యాల జిల్లా టియుడబ్ల్యుజె హెచ్ 143 సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజన్న సిరిపిల్ల జిల్లా వేములవాడలో సంఘ మహాసభలను నిర్వహించగా మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ హాజరై నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యుజెహెచ్ 143 సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా గంగుల రాంగోపాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగిత్యాల జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుని దోమ్మటి అంజుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా అడ్డగట్ట గంగాధర్లను ఎన్నుకున్నారు. వీరికి అల్లం నారాయణ నియామకపత్రాలను అందించగా, వీరి నియామకం పట్ల జిల్లా పాత్రికేయులు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 10 :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 11 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారుని కి భరోసా,నమ్మకం కలిగించాలన్నారు.బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం



**చురకలు విలేకరి, మెట్ పల్లి, ఫిబ్రవరి 10 :** భారతీయ జనతా పార్టీ పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని మెట్ పల్లి మండల బీజేపీ అధ్యక్షులు కొమ్ముల రాజ్ పాల్ రెడ్డీ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండల కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశలో రాజ్ పాల్ రెడ్డీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల కోసం భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులు నిరంతరం కృషి చేయాలని ఉపకార వేతనాలు బాలిక విద్య ప్రోత్సాహం లాంటి అనేక గ్రాడ్యుయేట్లు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం హక్కుల కోసం భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు మల్కా కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు మారు జనార్దన్ రెడ్డి, జంగిటి శ్రీధర్, గుండనీ భూమన్న, నల్ల వెంకటేష్, పీసు రాజేందర్,రమేష్ యాదవ్, సురేష్ రెడ్డి, దినేష్,సాయి రెడ్డి, బోగ గంగాధర్ వెంకటేష్ పాల్గొన్నారు.

## క్యూ న్యూస్ విలేఖరిని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట పిబ్రవరి 10 :**

ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎల్లారెడ్డిపేట మండలం క్యూ న్యూస్ శనార్తి తెలంగాణ విలేఖరి బెస్త నరేష్‌ను ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం పరమర్శించారు.అతని తండ్రి బెస్త నర్సయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించగా నరేష్ వారి కుటుంబ సభ్యులను ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్ బాయి ,ఎఎంసి వైస్ ప్రసిడెంట్ గుండాడి రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్రెడ్డి, నేవూరి సంతోష్ రెడ్డి, మద్దుల శ్రీపాల్ రెడ్డి ,లింగారెడ్డిలు పరమర్శించి వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు.

## శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 10 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోడేటి సతీష్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో సోమవా రం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు.అనంతరం వెల్గటూర్ కు చెందిన ఒల్లాల సతీష్ విజయలక్ష్మిల కుమార్తె నూతన వస్త్ర అలంకరణ కార్య క్రమంలో పాల్గొని ఆశీర్వదించా రు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్య క్షులు చల్లూరి రాంచందర్ గౌడ్, మాజీ యంపిపి కూనమల్ల లక్ష్మీ, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు ముల్కల గంగారాం, ఏలేటి క్రిష్ణా రెడ్డి, పత్తిపాక వెంకటేష్,ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, మాజీ పార్టీ మండల అధ్యక్షులు మూగల సత్యం,పెద్దూరి భరత్ కుమార్, ధర్మారం సింగిల్ విండో చైర్మన్ బలరాంరెడ్డి,పట్టణ శాఖా అధ్యక్షులు రంగు తిరుపతి గౌడ్, పొన్నం తిరుపతి గౌడ్,గుండ జగదీశ్వర్,కొప్పుల సురేష్,బందెల నరయ్య, బందెల రాజ య్య, మారం జగన్మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీ వంశీ జన్మదినం



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 10 :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో సోమవారం పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ జన్మదిన వేడు కలు రాష్ట్ర నాయకులు ఎండీ బషీర్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఎండీ అభి తదితర నాయకులు ఘనంగా జరిపారు. కేకు కత్తిరించి స్వీట్లు పంచారు.ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ రావు, బాల్ లింగు,నర్సయ్య,రవీందర్, అశో క్, సత్యనారాయణ,లక్ష్మణ్,శ్రవణ్,అనిల్,తిరుపతి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## స్థంబంపల్లి శ్రీ వెంకన్నస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**-పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 10 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి గ్రామ పరిసరాల్లోని గుట్టపై గుహలో స్వయంభూగా వెలిసి భక్తులకు కొంగుబంగామై నిలిచి పూజలు అందుకొంటున్న ప్రతియేడు లాగే ఆదివారం నుండి అయిదు రోజు ల పాటు శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్స వాలు ఘనంగా జరుగ నున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం శ్రీదేవిభూదేవి సమేత శ్రీ వెంకటేశుని కళ్యాణం ఆలయ ప్రాంగణంలో వైభవంగాజరిగింది. కళ్యాణ మహోత్సవంలో ప్రభు త్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని భక్తుల తో కలిసి వీక్షించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులకు ఇబ్బం ది కలగకుండా జాతర ఏర్పాట్లు చేయాలని ఆలయ నిర్వాహణ కమిటీ కి సూచించారు.గురువా రం స్వామి వారి రథోత్సవం జరుగనుంది. ఈ జాతర ఉత్సవాలకు చుట్టుప్రక్కల వారే కాకుండా సూదూర ప్రాంతాల నుంచి భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆదివారం జరిగిన కళ్యాణోత్సవం ప్రభుత్వ విప్ తో పాటు పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజలను నమ్మించి ధగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 10 :** ప్రజలు అడిగినా అడుగక పోయినా వారి సమస్యల పరిష్కారం కోసం తమ ప్రభుత్వ హయాంలో పనిచేశామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నమ్మించి ధగా చేస్తుందని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. సోమవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో పాత్రికేయుల సమావేశలో ఆయన మాట్లాడారు. వెల్గటూర్ కు మంజూరైన వ్యవసాయ కళాశాల ఏమైందని,ఒక్క అడ్మిషన్ ఎందుకు కాలేదని, అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ నిర్మాణానికి 2 కోట్ల నిధులను మంజూరు చేస్తే వాటిని రద్దు చేయించింది ఎవరని, కోటిలింగాల ఆలయ పునర్ని ర్మాణానికి గత ప్రభుత్వం2.5కోట్లమంజూరి చేయడం జరిగిందని, అభివృద్ధి పనులను ఎందుకు ప్రారంభం కాలేదని, వీటికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమా ధానం చెప్పాలని. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రె స్ పార్టీ ప్రభుత్వం వచ్చి 14 నెలలు కావస్తున్నా, ఎన్నికల సమయం లోఇచ్చినహామీలు వంద రోజుల్లో అమలు చేస్తామ ని ప్రజలను నమ్మించిఒక్కహామీ అమలు చేయలేదన్నారు. దేవు ళ్ళ మీద ఒట్లు పెట్టి ప్రజలను నమ్మించి గొంతు కోసిన నయ వంచక ప్రభుత్వం ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఇప్పటికీ మోసం చేస్తూనే ఉందన్నారు.అన్ని వర్గా ల ప్రజలు నమ్మి ఓటు వేస్తే ప్రజ లను నట్టేట ముంచిందని,మండ లంలో 30 గ్రామాలుంటే ఒక్క గ్రామంలో రైతు భరోసా ఎలా ఇస్తారన్నారు.పరిపాలన చేతకావడం లేదని,ప్రజలను క్షమించమని అడగాలని ఎద్దేవా చేశారు.కెసిఆర్ పాలనలో రైతు భరోసా టింగుటింగు మని ఖాతా ల్లో జమ య్యింది.కాంగ్రెస్ ప్రభు త్వం పై ప్రజలకు నమ్మకం పోయిందని,అభివృద్ధి అనేది శూన్యం, చేయకపోగా బడాయి మాటలు ఎక్కువగా ఉంటాయన్నారు. అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల్ల పని చేస్తున్నారు, పోలీసులు వాళ్ళు ఇంటి మను షుల్లా పని చేస్తున్నారని కొప్పుల ఆరోపించారు.కాంగ్రెస్ నాయకు డు దరఖాస్తు తీసుకొమ్మంటే తీసుకొనుడు, కేసు పెట్టమంటే పెట్టుడు, ఇదివరకు ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదన్నారు.ధర్మపురి నియోజక వర్గం వెల్గటూర్ మండలంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజలు చెప్పిన చెప్పక పోయినా ప్రజల అవసరాలున్న, ఎక్కడ ఏ సమస్యలు ఉన్నాయని గుర్తించి పరిష్కారించామని,ఎమ్మెల్యేగా మంత్రిగాఉన్నపుడు,ఈ ప్రాంత పిల్లలకు చదువు అవకాశం రావాలని, వ్యవసాయ కళాశా లను మంజూరు చేయించడం జరిగిందన్నారు.ప్రస్తుత ఎమ్మె ల్యే పట్టించుకోవడం లేదన్నారు. ధర్మపురి నియోజకవర్గం నుంచి గెలిచిన ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమా ర్ నీకు దమ్ము ధైర్యం, చిత్తశుద్ధి ఉంటే ఈ కాలేజీ కి అడ్మిషన్లు ఇప్పించి ప్రైవేటు భవనం లో కళాశాలను ప్రారంభించాలని ఈశ్వర్ డిమాండ్ చేశారు.శాతవాహనుల మొదటి రాజధాని కోటిలింగాల చారిత్రక ప్రాచు ర్యం కలిగిన ప్రదేశమని, కోటి లింగాల కోటేశ్వర స్వామి దేవాలయానికి రాజగోపురం నిర్మాణ పనులను ప్రారంభిం చాం, డబుల్ రోడ్డు నిర్మించడం జరిగింది, కోటిలింగాల నుండి పాశిగామ గ్రామానికి రోడ్డు, వయా స్తంభం పల్లి రోడ్డు వేయించడం జరిగిందన్నారు. హరిత హొటల్ నిర్మించడం జరిగింది దాన్ని ఎందుకు ప్రారం భించలేదు, ఇంకా జరగాల్సిన పనులు ఎక్కడిక్కడ ఆగిపోయా యి.అసలు గుడి నిర్మాణాన్ని పూర్తి చేస్తారా, చేయరా అంటూ ప్రశ్నించారు.మా ప్రభుత్వం లో అభివృద్ధి పనులు ముందట పెట్టినం, కానీ నీకు ప్రారంభించ డానికి 14 నెలలు సరిపోవడం లేదు స్తంభంపల్లి లో అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ నిర్మాణానికి 2 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశాం, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రద్దు చేయించిన ఘనత ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ దేనని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు బి ఆర్ ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను అధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 10 :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ బి.ఎస్.లత తో కలసి కలెక్టర్ స్వయంగా స్వీకరించారు.కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 30 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు మధుసూధన్, జివాకర్ రెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంత రావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 121 దరఖాస్తుల రాక

**-అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**-త్వరితగతిన పరిష్కారానికి ఆదేశాలు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట పిబ్రవరి 10 :** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 121 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 50, సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి 12, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి ఆరు, వ్యవసాయ శాఖ, ఉపాధి కల్పనా శాఖలకు 5 చొప్పున, జిల్లా పంచాయతీ కార్యాలయం, ఎంపీడీవో తంగళ్ళపల్లి, ముస్తాబాద్, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయానికి నాలుగు చొప్పున, జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాల యానికి మూడు, వైద్య కళాశాల, డిఆర్డిఓ, మిషన్ భగీరథ, ఎంపీడీవో కోన రావుపేట, సెస్ కార్యాలయానికి రెండు చొప్పున, ఏడి మైన్స్, జిల్లా వైద్యాధికారి, డిపిఆర్ ఈ, ఈవో రాజరాజేశ్వరాలయం వేములవాడ, నీటిపారుదల ,జిల్లా ఎస్పీ కార్యాలయం, వేములవాడ మున్సిపల్ కార్యాలయం,ఎంపీడీవో గంభీరావుపేట, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట రిజిస్టర్ కార్యాలయానికి ఒకటి చొప్పున వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి వేములవాడ ఆర్డిఓ రాజేశ్వర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈద్గా కమిటీ అధ్యక్షునిగా జమీల్ అహ్మద్



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 10 :** జగిత్యాల ఈద్గా కమిటీ అధ్యక్షునిగా సయ్యద్ జమీల్ అహ్మద్ నియమితులయ్యారు. సోమవారం జరిగిన సమావేశంలో సెంట్రల్ ముస్లిం కమిటీ సభ్యులు మత పెద్దలు, స్థానికులు ఈద్గా కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ జమీల్ అహ్మద్ ను నియమించారు. ఈ సందర్భంగా ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జమీల్ అహ్మద్ మాట్లాడుతూ తను గతంలో చేసిన సేవలకు గుర్తించి మరోసారి నియమించినందుకు సందర్భంగా కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఎల్వోసీ అందించిన ఎమ్మెల్యే



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 10 :** జగిత్యాల పట్టణానికి చెందిన బి. శృతి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందని స్థానిక జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించి ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ప్రభుత్వం నుండి రూ.1.50లక్షల ఎల్వోసిని మంజూరు చేయించారు. సోమవారం మంజూరైన ఎల్వోసీని శృతి కుటుంబసభ్యులకు అందించారు. ఎల్వోసీ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ కు శృతి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి ప్రవీణ్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోడపత్రిక ఆవిష్కరణ



**చురకలు విలేకరి, బీర్పూర్, ఫిబ్రవరి 10 :** బీర్పూర్ మండల కేంద్రంలోని ఆసునూరిగూడెంలో సోమవారం ఆదివాసీ నాయక పోడు సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీల ఆరాధ్యదైవం గాంధారీ ఖిల్లా మైసమ్మ మహాజాతర గోడపత్రికను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫిబ్రవరి 14 నుండి 16 వరకు మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామ పంచాయితీ పరిధిలో మహాజాతర జరగనుందని, పెద్ద సంఖ్యలో భక్తులు హజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్ది గంగాధర్, ఆసునూరి నర్సయ్య, అరె స్వామి, బట్టపెల్లి రవీందర్, దేవయ్య, గంగాధర్, రేవంత్, పోశన్న, బుచ్చిమల్లు, బుజన్న, దినేష్, పెద్ద నర్సయ్య, ముత్తయ్య, జలేందర్, చిన్న నర్సయ్య, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**చురకలు విలేకరి, బీర్పూర్, ఫిబ్రవరి 10 :** బీర్పూర్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం స్వామివారిని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే డా.సంజయ్యుమార్కు తీర్థప్రసాదాలు అందించి స్వామివారి శేషవస్త్రంతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బెదిరింపులకు గురిచేస్తే 100 నెంబర్‌కు డయల్ చేయండి

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 10 :** ఎవరైనా బెదిరింపులకు గురి చేస్తే 100 నెంబర్ కు డయల్ చేయాలని షీ టీం ఎస్సై లావణ్య అన్నారురామగుండం సి.పి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జ్ ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో పెద్దపెల్లి , చింతలవాడ లోని రైసింగ్ సన్ స్కూల్ విద్యార్థలకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబెర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం



ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. అమ్మాయిలకు ఎలా జాగ్రత్తగా ఉండాలని తెలియజేసారు.ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు సురేష్ , మౌనిక మరియు కరస్పండెంట్ సాయిద్ అహ్మద్ మరియు హెడ్ మాస్టర్ హకీమ్ ఖాన్ మరియు ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్కాపేట రిజర్వేయర్ నీటి విడుదల గురించి కలెక్టర్‌కు వినతిపత్రం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట పిబ్రవరి 10 :** మల్కాపేట రిజర్వేయర్ నుండి నీటి ని విడుదల చేయాలని ఎల్లారెడ్డిపేట మండల రైతులు కలెక్టరేట్ కు వెళ్లి జిల్లా కలెక్టర్ కు సోమవారం వినతిపత్రం అందజేశారు.కలెక్టర్ ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కల్లూరి బాపు రెడ్డి, పాతూరి భూపాల్ రెడ్డి, రాజన్నపేట మాజీ సర్పంచ్ ముక్క శంకర్ నాయకులు ఉన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుక నవుతా

### -బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొంరయ్య

**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 10 :** ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుక నవుతానని,కరీంనగర్, ఆదిలాబాద్ , నిజామాబాద్ , మెదక్ టీచర్స్ ఎమ్మెల్సీబిజెపి అభ్యర్థి మల్క కొంరయ్య అన్నారు. సోమవారం రోజున కరీంనగర్ పట్టణం లో భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేశారు. అనంతరం ఎస్ బి ఎస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. గత బిఆర్ఎస్,



నేటి కాంగ్రెస్ ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక ప్రభుత్వాలుగా మారాయన్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రెండు ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు కేవలం జీతాలు పొందుతున్నారే తప్ప ఏ సౌకర్యాలు పొందడం లేదన్నారు. ముఖ్యంగా ఉద్యోగ విరమణ చెందుతున్న ఉపాధ్యాయులకు పెన్షన్, గ్రాట్యూటి, జిపిఎఫ్, సరెండర్ లీవ్ డబ్బులు, పిఆర్ సి ఇచ్చే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు. బి ఆర్ఎస్ , కాంగ్రెస్ ఎమ్మెల్సీలు ఏనాదు కూడా ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల కోసం కొట్లాడింది లేదు, శాసనమండలిలో మాట్లాడింది లేదన్నారు. ఆ రెండు పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం ఇచ్చినందున జరగబోయే ఎన్నికల్లోబిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు అవకాశం కల్పించాలని కోరారు.. ఈ సమావేశంలో మాజీ శాసనసభ్యులు ఎస్వీఎస్ ప్రభాకర్ గారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు అనంతరావు, ప్రధాన కార్యదర్శి సురేష్, నాయకులు పోలి సత్యనారాయణ నరేంద్ర రావు కృష్ణవేణి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి నామినేషన్‌కు తరలివెళ్ళిన కాంగ్రెస్ పార్టి నాయకులు

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట పిబ్రవరి 10 :** కాంగ్రెస్ పార్టీ ఎంఎల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి సోమవారం నామినేషన్ వేసిన సందర్భంగా ఎల్లారెడ్డి పేట కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్ళారు.కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ కళాశాల నుండి ఇందిరా గాంధీ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు జరిగిన ర్యాలీలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు దోమ్మాటి నరసయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాద్యక్షులు షేక్ గౌస్ బాయి, ఎ.ఎం.సి వైస్ ప్రసిడెంట్ గుండాడి రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# రాజ్యాంగానికి, మొలతాడుకు తేడా తెలవని బుద్ధిహీనుడు బండి సంజయ్

### -బీసీలపై బండి సంజయ్‌కి ప్రేమ ఉంటే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఎందుకు వ్యతిరేకించలేదు..?

### -ఈడబ్ల్యూఎస్ వద్దని, నరేంద్ర మోడీని నిలదీసే దమ్ము బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు ఉందా..?

### -బిఆర్ఎస్ మైనారిటీ యూత్ అసెంబ్లీ అధ్యక్షుడు నవాజ్ హుస్సేన్ విమర్శ

**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 10 :** రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారా దేశ పౌరులందరూ స్వేచ్ఛ సమానత్వం పొందడంలో అందరూ సమానమేనని, ఇందులో కుల మతాలకు తావు లేదని, భిన్నత్వంలో ఏకత్వం ఈ దేశ ఔన్నత్యం అని, మొలతాడు కట్టుకున్న వాళ్లు కట్టుకొని వాళ్ళు ఒక్కటి ఎలా అవుతారని కేంద్ర మంత్రి హెూదాలో బండి సంజయ్ మూర?త్వంగా మాట్లాడడం అతడి బుద్ధిహీనత్వానికి నిదర్శనమని మైనారిటీ అసెంబ్లీ నియోజకవర్గం బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ నవాజ్ హుస్సేన్ ఒక ప్రకటనలో విమర్శించారు. హిందూ ముస్లింలను రెచ్చగొట్టి బిజెపి ఎన్నికల ముంగిట రాజకీయ లబ్ధి కోసం కుటిల రాజకీయాలకు పాల్పడుతొందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో పేద, వెనకబడిన, దారిద్ర రేఖకు దిగువనున్న ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని, రాజేందర్ సచార్ కమిటీ తోపాటు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం వేసిన శ్రీకృష్ణ కమిటీలు ఆనాటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు సమర్పించాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో దళితుల కంటే దుర్భరమైన స్థితిలో ముస్లింలు జీవితం వెల్లదిస్తున్నారని విద్యకు దూరమై ఉద్యోగ ఉపాధి రంగాల్లో తీవ్రంగా వెనుకబాటుతనానికి గురయ్యారని రాజేందర్ సచార్ కమిటీ, శ్రీకృష్ణ కమిటీలు ఆనాటి ప్రభుత్వాలకు నివేదికలు సమర్పించిన మాట బిజెపి



నాయకులకు తెలియకపోవడం వారి బుద్ధిహీనత్వానికి నిదర్శనం అన్నారు . కేవలం రాజకీయ పబ్బం కోసం మాత్రమే బీసీ రిజర్వేషన్ల నుండి ముస్లిం అనే పదాన్ని తొలగిస్తామనడం కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు తగదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పోరాడి సాధించుకున్న ముస్లిం రిజర్వేషన్లను ప్రాణాలు అడ్డుపెట్టి అయినా కాపాడుకుంటామని చెప్పారు. విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో వెనకబడిన ముస్లింలకు మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తున్నారని సయ్యద్, మొగల్, పఠాన్, షాఫాయి తెగలలోని ముస్లింలు సైతం అత్యంత దుర్భరమైన స్థితిలో జీవితం గడుపుతున్నారని వారికి సైతం బీసీ లో రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రులుగా ప్రజలు ఇచ్చిన బాధ్యతలను మరచి అభివృద్ధి చేయాల్సిన వీళ్ళు, కులాల మధ్య, మతాల ప్రాతిపదికన ప్రజల మధ్య చిచ్చు పెట్టడం ఎంతవరకు సమంజసం అని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని అందుకే బిజెపిని తెలంగాణలో అధికారంలోకి రాకుండా గట్టిగా గుణపాఠం చెప్పిన బిజెపి నేతలకు ఇంకా సోయి, సిగ్గు రావడంలేదని విమర్శించారు. భారతదేశంలో ముస్లింలేకుంటే బిజెపి పార్టీ ఉనికే ఉండదని, ఆ పార్టీకి పుట్టగతులు లేకుండా ఉండేదన్నారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో వేలాదిమంది ముస్లింలు దేశంపై ప్రేమ అభిమానంతో బ్రిటిషర్ల చేతిలో ఉరికంబాలెక్కి ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. దేశం కోసం ఆత్మాభిమానంతో ప్రాణాలు అర్పించిన చరిత్ర ముస్లింలది అయితే దేశ స్వాతంత్ర సంగ్రామ పోరాటానికి సంబంధించిన రహస్యాలను ఆంగ్లేయులకు తొత్తులుగా మారి రహస్యాలను చేరవేసిన గూడచార్య వ్యవస్థ ఆర్ఎస్ఎస్ సంఘ పరివార్లది కాదా ఇది దేశవాసులకు తెలియదా అని మండిపడ్డారు. నేడు ముస్లింలపై అరిచి గీ పెడుతున్న బిజెపి పార్టీ రాజకీయ లబ్ధి కోసం బీసీ నినాదం ఎత్తుకొని దొంగ నాటకాలు ఆడుతోందని విమర్శించారు. ఎస్సీ లపై, ఎస్టీలపై, బీసీలపై ప్రేమ ఉంటే బిజెపి పార్టీ ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పుడు బీసీగా ఉన్న బండి సంజయ్ బీసీలకు అన్యాయం జరుగుతుందని నరేంద్ర మోడీని ఎందుకు పార్లమెంట్ వేదికగా నిలదీయలేకపోయారో యావత్తు బీసీ సమాజంతో పాటు రాష్ట్ర ప్రజలు గుర్తురుగాలన్నారు. బీసీలకు అన్యాయం జరుగుతుందని ఈ డబ్ల్యూ ఎస్ కోటాను దేశవ్యాప్తంగా తగ్గించాలని పార్లమెంట్లో నరేంద్ర మోడీని అమిత్ షాను నిలదీసే దమ్ము ధైర్యం బండి సంజయ్ కి, కిషన్ రెడ్డిలకు ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణలో మాయ మాటలు చెప్పి అకస్మాత్తుగా ఆకాశమూడిపడ్డట్టు బీసీ నినాదం ఎత్తుకొని రాజకీయ లబ్ధి కోసం బిజెపి నేతలు చేస్తున్న దొంగ నాటకాలకు ప్రజలందరూ చైతన్యవంతులై, ఏకమై, తెలంగాణలో బిజెపికి రాజకీయ సమాధి కట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణను బిజెపి పాలిత రాష్ట్రాల మాదిరిగా కల్లోలిత రాష్ట్రంగా మార్చాలని బిజెపి నాయకులు ప్రజల మధ్య మతవంయాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని వీరి కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

# ప్రారంభమైన సింగాపురం వెంకన్న బ్రహ్మోత్సవాలు

**-హాజరైన మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**



**చురకలు విలేఖరి చిగురుమామిడి ఫిబ్రవరి 10 :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం సింగాపురం గ్రామంలోని శ్రీ పద్మ గోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలు మూడు రోజులపాటు కన్నుల పండుగగా జరగనున్నాయి. చివరి రోజైన బుధవారం స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరగనుంది. మొదటి రోజు పూజా కార్యక్రమంలో భాగంగా.. గణపతి పూజ, పుణ్యాహవాచనం, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, భక్తుల గోవింద నామ స్మరణ మధ్య నిర్వహించిన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవాలయాన్ని పూలమాలలతో సుందరంగా అలంకరించారు. అలాగే ఉత్సవ మూర్తులను, స్వామివారి, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తుల గోవింద నామ స్మరణ మధ్య ఉత్సవ మూర్తులను రథంలో ఊరేగించారు. బుధవారం ఉదయం జరిగే కళ్యాణోత్సవ కార్యక్రమానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యదర్శి, మాజీ ఎంఎల్ఏ వోడితలా సతీష్ కుమార్ తెలిపారు.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా

**-బిజెపి గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి**




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 10 :** జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశమిస్తే , దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని బిజెపి గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి తెలిపారు. బిజెపి లీగల్ సెల్ అధ్యక్షులు శ్రవణ్ ఆధ్వర్యంలో సోమవారం రోజున జిల్లా కోర్టులో బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిన్యాయవాదుల ను కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. గతంలో కాంగ్రెస్ ,బిఆర్ఎస్ పార్టీలకు ఎమ్మెల్సీల్లో అవకాశం ఇచ్చారని , ప్రస్తుతం ఎన్నికల్లో బిజెపి ఒక్క అవకాశంఇవ్వాలని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని అంజిరెడ్డి ఈ సందర్భంగా న్యాయవాదులను కోరారు. న్యాయవాదుల సమస్యల కోసం గళం విప్పుతానని , న్యాయవాదుల వెన్నంటూ ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అంజిరెడ్డి హామీ ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో న్యాయవాదులు , బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, భాష సత్యనారాయణ రావు, శ్రవణ్ కుమార్ , బేతి మహేందర్ రెడ్డి, పెద్దపల్లి జితేందర్, సుగుర్తి జగదీశ్వర చారి, సోమిడీ వేణు ప్రసాద్ , నాగసముద్రం ప్రవీణ్ ,ఉప్పరపల్లి శ్రీనివాస్, గాయత్రీ దేవి, గాజుల స్వప్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**గ్రాడ్యుయేట్స్ లసమస్యలు పరిష్కరించడంలో బి ఆర్ ఎస్ , కాంగ్రెస్ విఫలం....**

రాష్ట్రంలోని విద్యావంతుల, నిరుద్యోగ పట్టబద్రుల సమస్యలు పరిష్కరించడంలో గత బిఆర్ఎస్ , నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి అన్నారు. సోమవారం రోజున కరీంనగర్ పట్టణం అంబేద్కర్ స్టేడియం లో మార్నింగ్ వాకర్స్ ను బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కాంగ్రెస్ , బిఆర్ఎస్ ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి కల్పించలేకపోయాయని, వారికి ఇస్తామన్న ప్రకటించిననిరుద్యోగ భృతి కూడా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. అలాంటి పార్టీల మోసపూరిత మాటలను , వాగ్దానాలను నమ్మవద్దన్నారు. విద్యారంగ సమస్యలు, పట్టభద్రుల సమస్యల పరిష్కారం , అభివృద్ధి కోసం ఆలోచించేది కేవలం బిజెపి యే అన్నారు. జరగబోయే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, సాయిని మల్లేశం , వంగల పవన్ , పెద్దపెల్లి జితేందర్ , మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, మామిడి చైతన్య, గాజుల స్వప్న, సునీత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని

# పట్టభద్రులు భారీ మెజార్టీతో గెలిపించాలి

**-వెలిచాల రాజేందర్ రావు**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 10 :** ఉమ్మడి మెదక్- నిజామాబాద్- అదిలాబాద్ - కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామ గ్రామానా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు నరేందర్ రెడ్డి కి అత్యధికంగా ఓట్లు పడేలా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. నరేందర్ రెడ్డి గెలుపునకు తన శాయశక్తుల అహర్నిశలు పాటుపడతానని పేర్కొన్నారు. సోమవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లా డుతూ విద్యావేత్త విద్యా వ్యవస్థ పై పట్టు కలిగిన నరేందర్ రెడ్డి కి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు పట్టం కట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు నిరంతరం అండగా నిలుస్తున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే నిరుద్యోగ సమస్య, పట్టభద్రులు సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు పట్టభద్రులంతా సహకరించాలని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ పాలకులు నిరుద్యోగులను అవసరానికి వాడుకొని వదిలేశారని మండిపడ్డారు. అలాగే బిజెపి నాయకులు పట్టభద్రుల సమస్యలను ఏ ఒక్కటి పరిష్కరించలేదని విమర్శించారు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు రాగానే బీఆర్ఎస్, బిజెపి నేతలు కొత్త కొత్త హామీలు ఇస్తూ పట్టభద్రులపై తెగ ప్రేమ ఒలకబోస్తున్నారని పేర్కొన్నారు. వారు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు నమ్మే పరిస్థితులు లేరని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో 55 వేల ఉద్యోగాలను భర్తీ చేశారని పేర్కొన్నారు. ఒక్క ఏడాదిలో ఏ రాష్ట్రంలోనూ ఇలా ఉద్యోగాలు కల్పించిన దాఖలాలు లేవు అని తెలిపారు. కమిట్మెంట్ ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని పేర్కొన్నారు. పట్టభద్రులు, నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తమకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నారని చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి ని గెలిపించేందుకు పట్టభద్రులు కంకణబద్ధులై ఉన్నారని రాజేందర్ రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంతోనే నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బిజెపి మోసపూరిత హామీలను, ప్రకటనలను నిరుద్యోగులు, పట్టభద్రులు నమ్మవద్దని వెలిచాల రాజేందర్ రావు సూచించారు.

# కుల గణన సర్వే చేసి బీసీలకు అన్యాయం చేస్తారా...?

**-హిందూ బిసి, ముస్లిం బిసి లనీ ప్రపంచంలో ఎక్కడైనా ఉందా...?**

**-బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఏన్నం ప్రకాష్**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 10 :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే బీసీ సమాజానికి తీవ్ర అన్యాయం చేసేలా ఉందనీ, సర్వేలో బీసీల జనాభా శాతాన్ని తగ్గించి చూపించారని, హిందూ బిసి, ముస్లిం బీసీలనీ ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కొత్త పదాన్ని సృష్టించారని , దీనివల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ సంఘాల నేత ఏన్నం ప్రకాష్ అన్నారు. సోమవారం కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన కులగనన సర్వే బీసీలకుఎంతోఉపయోగపడుతుందని భావిస్తే నేడు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన లెక్కలు , వివరించిన తీరును చూస్తుంటే బీసీ సమాజానికి తీవ్ర నష్టం చేకూర్చేలా ఉందన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 51 శాతం బీసీలు ఉంటే నేడు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 46 శాతం చూపించారని, దాదాపు 21 లక్షల మందిబీసీలజనాభాతగ్గిపోయిందనీ, ఇది దారుణమైన విషయమన్నారు. రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న బిసి లను దెబ్బతీయడానికే ప్రభుత్వము ఈ కులగనన సర్వే చేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. బీసీ ల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మళ్ళీ రీ సర్వే చేయాలనీ, అలాగే హిందూ ముస్లిం,బీసీ పదాన్ని కూడా తొలగించాలని అయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో మొండిగా వ్యవహరించి బీసీ లకు అన్యాయం చేయాలని చుస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని,భారీ ఎత్తున ఉద్యమిస్తామనీ ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

# నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన తాజా మాజీ సర్పంచ్



**చురకలు ప్రతినిధి ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 10 :** రామగిరి మండలం రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు 25 వ వివాహ వార్షికోత్సవ వేడుకలు, సీనియర్ జర్నలిస్టు పీవీ రావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సెంటినరీ కాలనీ, రాం నగర్, రత్నాపూర్ లో 30 మంది నిరుపేదలకు బియ్యం, నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు, ఉపాధి కార్మికులకు, విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. పలువురు కేక్ లు కట్ చేసారు. మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు ను స్థానికులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధర్మల రాజ సంపత్, టి.ఆర్.ఎస్ అధ్యక్షుడు భాద్రపు ప్రశాంత్ రావు, బత్తిని ప్రశాంత్(రాం నగర్), మాజీ వార్డ్ సభ్యులు బొంగురాల రవి, సందవేన కుమార్, జక్కుల ఆశాలు, బొగే సతీష్,మన్నాల రాహుల్, దాసరి మల్లి, ధర్మల సాయి, మైలారం శ్రీనివాస్, ముక్కెర సతీష్, మేకల రాంచందర్, కత్తి మహేష్, సోమరపు కనకయ్య, చెల్కల ఆదిత్య, ఓరం అనిల్, బెజ్జల ఓం ప్రకాష్, కాపర్తీ వెంకటేష్, మామిడి వీరయ్య, ఎలుక కుమార్, వేముల రాజు, కట్టేకోల ఓదెలు, ఇజ్జగిరి సంపత్, ముక్కెర మనిదీప్, పున్నం మని తేజ,బుదరపు వినయ్, కట్ట సంపత్, ముడుసు నర్సయ్య,ముక్కెర సతీష్, బుద్దుల తిరుపతి, బుద్ధుల రవి, రొడ్డ శ్రీనివాస్, తన్నీరు ప్రదీప్, ఆర్మీ సాయి , పోకిరి సత్యం . జర్నలిస్టు లు బుర్ర తిరుపతి, పొన్నం శ్రీనివాస్, చిందం రమేష్, జె.ఆర్ ప్రవీణ్, చింతం కిరణ్, చిలుక సురేష్, మల్యాల రమేష్, కాపార్తి వెంకటేష్, పోలు మదుకర్, పబ్బా మొగిలి, తదితరులు పాల్గొన్నారు. సెంటినరీ కాలనీ రాణి రుద్రమ దేవి స్టేడియం లో వాలి వాల్ క్రీడాకారులు జర్నలిస్టు పీవీ రావు జన్మ దిన వేడుకల సందర్భంగా క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డా.బొద్దుల జగన్, సూదుల ఐలయ్య, అవునూరి శ్యామ్, పోరాండ్ల శ్రీకాంత్, బుద్దుల తిరుపతి, రవి, రోడ్డా శ్రీనివాస్, తన్నీరు ప్రదీప్, ఆర్మీ సాయి పోకిరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులు అయితే ఏంటి..ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తారా..?

**-అధికార పార్టీకి రైట్.. విపక్షాలకు నో ఎంట్రీనా..**
**-మంత్రులను, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను పోలీసులు లోనికి ఎలా పంపారు**
**-బిఆర్ఎస్ రాష్ట్ర నేత, ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్ సింగ్ వాగ్వివాదం**
**-కలెక్టరేట్ వద్ద తోపులాట.. తీవ్ర ఉద్రిక్తత..**



**చురకలు ప్రతినిధి, కరీంనగర్ ఫిబ్రవరి 10 :** కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు చివరి రోజు కావడంతో నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు కరీంనగర్ ఎన్నికల అధికారి కార్యాలయానికి చేరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డి మరో సెట్ నామినేషన్ దాఖలు చేయగా రాష్ట్ర మంత్రులు, టీపీసీసీ చీఫ్ తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. అయితే నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్లిన వి. నరేందర్ రెడ్డితో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వాహనాలను కార్యాలయ ఆవరణలోకి అనుమతించారని, ఇండిపెండెంట్ అభ్యర్థుల వాహనాలను మాత్రం లోపలకు వెళ్లనీయడం లేదని ఆరోపించారు. సర్దార్ రవిందర్ సింగ్ నామినేషన్ వేసేందుకు వెల్తున్న క్రమంలో పోలీసులు అతని వాహనాన్ని నిలువరించారు. దీంతో రవిందర్ సింగ్‌తో పాటు ఇతర ఇండిపెండెంట్ అభ్యర్థులంతా కూడా నిరసన వ్యక్తం చేశారు.నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ ఇండిపెండెంట్ అభ్యర్థులు అధికారుల తీరుపై విమర్శలు చేశారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన అభ్యర్థుల అనుచరులు కూడా అధికారుల చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పోటాపోటీగా నినాదాలు చేశారు పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని చక్కబెట్టారు.

# కాంగ్రెస్ బీసీ హిందూ, బీసీ ముస్లిం పేరిట మత రాజకీయాలు చేస్తుంది

**-బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 10 :** బిజెపి మోడీ ప్రభుత్వం సబ్ కా సాత్, సబ్కా విశ్వాస్ , సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్ నినాదం, లక్ష్యంతో పనిచేస్తుందని, కాంగ్రెస్ మాత్రం బీసీ హిందు, బీసీ ముస్లిం ల పేరిట విడగొట్టే మత రాజకీయాలు చేస్తుందని బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ మండిపడ్డారు. సోమవారం కరీంనగర్లో మీడియాతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మొదటి నుండి మత రాజకీయాలపై ఆధారపడిందని, అందుకే మైనార్టీలను ఓటు బ్యాంకుగా మలుచుకోవడానికి అనేక రాజకీయాలు చేసిందన్నారు. గతంలో రాజశేఖర్ రెడ్డి హయాంలో మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు, నేడు కులగనన పేరిట రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన హిందూ బీసీ, ముస్లిం బీసీ లు పనికిమాలిన రాజకీయ అడుగుల్లో భాగమేనన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అనే కొత్త పదాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు తీసుకువచ్చి హిందూ ముస్లింల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేశారని ఆయన మండిపడ్డారు. బీసీల్లో ఎన్నో ఉపకులాలు ఉన్నాయని , ముస్లింలలో ఎన్నో ఉపకులాలు ఉన్నాయని , ఎవరి అర్హతలను బట్టి వారు బీసీ జాబితాలో ఉంటారన్నారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఈ విషయంలో దురుద్దేశంఉందని ,అందుకేహిందూ బిసి, ముస్లిం బీసీ అని మతాల మధ్య చిచ్చు పెట్టే పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యల ను తప్పుపడుతూ కరీంనగర్ కాంగ్రెస్ మైనార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ మైనార్టీ నాయకులు అంధకారంలో ఉన్నారని , మైనార్టీల కోసం కాంగ్రెస్ చేసింది ఏమీ లేదని, కనీసం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మైనార్టీ లకు ఏ లాంటి ప్రాధాన్యత లేదని కనీసం మైనార్టీ మంత్రి కూడా లేదని విమర్శించారు. మతాలను, కులాలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేసే అలవాటు కాంగ్రెస్కే ఉందని , బిజెపి స్టేట్ ఫార్వర్డ్ గా ఉంటుందని , అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం హిందూ , ముస్లిం లని వేర్వేరు రాజకీయాలు ఏ కృద చేయలేదని, కనీసం పథకాలు కూడా పెట్టలేదని , అందర్నీ సమాన దృష్టితో చూస్తూ ప్రభుత్వ పథకాలను అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇంచార్జ్ మొహమ్మద్ బషీరుద్దీన్, జిల్లా అధ్యక్షుడు సమీపరివేజ్ , జిల్లా ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ సమ్యుల్లా అహ్మద్, సయ్యద్ షహీదాద్, మొహమ్మద్ తాజ్, సిద్ధిక్ షదాబ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి శక్తి చాటి చెప్పాలి

**-కాంగ్రెస్, బిఆర్ఎస్ ల పనైపోయింది**
**-నిరుద్యోగ పట్టభద్రులకు కాంగ్రెస్ సర్కార్ రూ..56 వేల బాకీ చెల్లించాల్సి ఉంది**
**-బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 10 :** జరగబోయే గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి శక్తి చాటి చెప్పాలని, బిజెపి పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్కకొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయించడానికి కృషి చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. జమ్మికుంట బిజెపి శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజున స్థానికంగా ఎమ్మెల్సీ ఎన్నికల వర్క్ షాప్ ప్రోగ్రాం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పట్టభద్రులను,ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేసిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం నేడు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రుల, టీచర్స్ ల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ముఖ్యంగా నిరుద్యోగులకు కాంగ్రెస్ హామీ ప్రకారం రావాల్సిన నిరుద్యోగ భృతి రూపాయలు 4000 నేటికీ ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. ఒక్కో నిరుద్యోగికి కాంగ్రెస్ ప్రభుత్వం 56000 బాకీ పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రులకు ఎలాంటి ఉపాధి చూపెట్టకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకున్న పట్టభద్రులు ఎన్నికల్లో కాంగ్రెస్కు ఓటు వేస్తే తీవ్రంగా నష్టపోతారని, భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే నిరుద్యోగ పట్టభద్రులను మోసం చేసిన కాంగ్రెస్ కు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. విద్యార్థుల, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కొట్లాడింది కేవలం బిజెపి యే అన్నారు. అందుకే జరగబోయే ఎన్నికల్లో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంగోపాల్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, బిజెపి జిల్లా కార్యదర్శి చెన్నమాధవుని నరసింహ రాజు, బింగి కరుణాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విద్యాసాగర్ రెడ్డి,బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మాసాడి ముత్యంరావు, కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, బిజెపి మండల అధ్యక్షులు సంపెల్లి సంపత్ రావు, బత్తిని నరేష్,బైరెడ్డి రమణారెడ్డి, తూర్పాటి రాజు, ర్యాకం శ్రీనివాస్,జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, జమ్మికుంట మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్, మాజీ మండల అధ్యక్షులు జీడి మల్లేష్, రామిడి ఆదిరెడ్డి, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బస్ టైరు పగిలి తృటిలో తప్పిన ప్రమాదం

**-ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఫిబ్రవరి 10 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల సమీపంలో సోమవారం కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై కామారెడ్డి నుండి సిరిసిల్లకు వెళ్తున్న ఆర్టీసీ బస్ వెనుక టైర్ ఒక్కసారిగా పేలడంతో డ్రైవర్ చాకచక్యంగా కంట్రోల్ చేసి సైడ్ కు ఆపడంతో పెను ప్రమాదం తప్పింది. అందులో ఉన్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై ఆర్టీసీ యాజమాన్యానికి డ్రైవర్ సమాచారం అందించారు. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులను మరో బస్సులో వారివారి గమ్యస్థానాలకు పంపారు.కాగా వారం రోజుల క్రితం కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గోరంటాల సమీపంలో ఫ్రంట్ సైడ్ టైరై పగిలి అదుపుతప్పి రైట్ సైడ్ పొలంలోకి వెళ్ళి భారీ ప్రమాదం తప్పిన విషయం తెలిసిందే.

# ఆపదలో ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

**-మంత్రి శ్రీధర్ బాబు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 11 :** ప్రతి ఒక్కరిని ఆపదల ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదెల శ్రీధర్ బాబు అన్నారు. ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ కు మాజీ వార్డు సభ్యులు సోమిడి.శ్రీనివాస్ కి గత సంవత్సరం అనారోగ్యం నిమిత్తం వైద్యం చేయించుకోగా ... గత ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కుల జారీ జాప్యం చేయడంతో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి .దుద్ధిళ్ల.శ్రీధర్ బాబు దృష్టికి మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ ఇజ్జగిరిరాజు,బర్ల రాజు తీసుకు వెళ్లగా వారు స్పందించి 47,500/-విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇప్పించడం జరిగింది...ఇవాళ ఆ చెక్కను రామగిరి మండలం మాజీ ఎంపిపి ఆరెల్లి.కొంరయ్య, జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ ఇజ్జగిరి.రాజు, కాంగ్రెస్ నాయకులు కల్వచర్ల మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, పుల్లెల కొమరయ్య, సిద్ధం మురళి,ఇజ్జగిరి వెంకటేష్, ఆరెల్లి మహేందర్, మోత్కూర్ నవీన్, బంకు మల్లేష్,బర్ల శివ చేతుల మీదుగా అందజేశారు...సోమిడి.శ్రీనివాస్ దీనికి సహకరించిన మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , శ్రీను బాబు కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా వొజ్జల అగ్గి రాములు ఏకగ్రీవం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఫిబ్రవరి 10 :** సిరిసిల్ల పట్టణ మున్నూరు కాపు సంఘం పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు నీలి శంకర్ గడ్డం నరసయ్య బొప్ప దేవయ్య కల్లూరి రాజు ఎరుకల సూర్యప్రకాష్ పట్టణ సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో పట్టణ నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు.అధ్యక్షులుగా వొజ్జల అగ్గి రాములు,ఉపాధ్యక్షులుగా కుల్ల సత్తయ్య దుమల రామకృష్ణ,ప్రధాన కార్యదర్శిగా ఇప్పపుల లక్ష్మణ్,కోశాధికారిగా ఐలి శ్రీనివాస్, సహాయ కోశాధికారి తోట శంకర్,సహాయ కార్యదర్శిగా కోడి మ్యాల వేణుగోపాల్,కార్యనిర్వహ కార్యదర్శిగా చల్ల రవీందర్,సంయుక్త కార్యదర్శిగా బత్తుల భూమేష్,కార్యవర్గ సభ్యులుగా శీలం రాజు,లింగంపల్లి సతీష్,పల్లికొండ నరసయ్య,సొక్కి శ్రీనివాస్, కాశెట్టి పరశురాములు,ఇప్పపూల రాజు,కుస మహేష్ బల్యాల శ్రీనివాస్ ఎన్నుకోవడం జరిగింది.

# అంజన్నకు బంగారు కిరీటం బహుకరణ

**-దాతలు ముందుకు వస్తేనే తీరిన సమస్య**
**-సంభావన కోసం క్యూలైన్‌లో అధికారులు**



**చురకలు విలేకరి, మల్యాల, ఫిబ్రవరి 10 :** జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న ఆలయానికి బంగారు కిరీటాన్ని సోమవారం దాతలు అందజేశారు. ఏ.ఎం.ఆర్ ఇండియా లిమిటెడ్ కంపెనీ చైర్మన్ మహేష్ రెడ్డి, రాధిక దంపతులు గర్భాలయంలోని మూలవిరాట్ కు రాగి రేకుపై బంగారు తాపడంతో చేసిన 325 గ్రాముల కిరీటం,అంతరాలయం లోని గోడలకు 48కిలోల 500 గ్రాముల వెండి తాపడాలు, మకరతోరణం తయారు చేయించి మంగళవారం ఆలయానికి అందజేశారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామి వారికి అలంకరించారు.దాతల గోత్రానామాలపై అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

**రెండేళ్లకు మోక్షం...**

గత రెండు సంవత్సరాల క్రితం, కొండగట్టు అంతరాలయంలో దొంగలు పడి గోడలకు ఉన్న వెండి తాపడాలను విలువైన వస్తువులను దోచుకెళ్లారు. అప్పటినుండి ఆలయ గర్భగుడి కళావిహీనంగా మారింది. ఆలయానికి బంగారు, వెండి నిలువలు భారీగా ఉన్న అధికారులు మాత్రం కొత్తవి తయారు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు.కొత్త తాపడాలు వేయడానికి నోచుకోలేదు. ఆలయంలో విధులు నిర్వహించే జూనియర్ అసిస్టెంట్ ఉమమహేశ్వరరావు ఏ.ఎం.ఆర్ సంస్థ వారికి కిరీటం,తపాడాలు విషయం గురించి తెలిపారు.వెంటనే సంస్థ వారు సుమారు కోటి రూపాయల విలువచేసే వస్తువులను సోమవారం అందజేశారు. ఏది ఏమైనా రేండేళ్ళకైనా మోక్షం వచ్చిందని భక్తులు సంతోషం వ్యక్తం చేస్తు దాతలను అభినందిస్తున్నారు.

**సంభావన కోసం క్యూలైన్‌లో అధికారులు....**

ఒక మంచి కార్యక్రమాన్ని చేసేందుకు ఆలయానికి ఏఎంఆర్ కంపెనీ ప్రతినిధులు ముందుకు వచ్చారు. అంజన్నకు బంగారు కిరీటం అందజేసిన అనంతరం అర్చకులకు సంభావన అందజేశారు. ఆలయ అధికారులు సైతం క్యాకట్టి సంబావన తీసుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.సదరు దాతలు ఆలయ అధికారులు, సిబ్బందికి కూడా తలా కొంచెం సంభావన ఇవ్వడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఏది ఏమైనా మరి ఈ విధంగా అధికారులు తయారవడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## శాత్రాజ్ పల్లి గ్రామాన్ని ముత్తారం

# మండలంలోనే ఉండేలా చూస్తా



**-మంత్రి శ్రీధర్ బాబు**

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 10 :** గతంలో ముత్తారం మండలంలో ఉండి ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో కల్పిన శాస్త్రపల్లిని మళ్లీ ముత్తారంలో కల్పాలని ముత్తారం కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్ బాబును కోరారు. దీంతో ఆయన స్పందించి మళ్లీ ముత్తారం మండలం లో కలిపేలా అధికారులను శ్రీధర్ బాబు ఆదేశించారు.ముత్తారం మండలం నుండి సాత్రాజుపల్లి గ్రామాన్ని తొలగించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో కలపడం జరిగింది. శాత్రాజుపల్లి గ్రామ ప్రజలు గ్రామం ముత్తారం మండలంలోనే ఉండాలి అని రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమ శాఖ మాత్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబుని కలిసి విన్నవించు కోవడం జరిగింది. మంత్రివర్యులు వెంటనే స్పందించి ఉన్నతాధికారులకు శాత్ రాజ్ పల్లి గ్రామాన్ని ముత్తారం మండలంలోనే ఉంచాలని అధికారులను ఆదేశించడం జరిగింది.అధికారులు శాత్ రాజ్ పల్లి గ్రామాన్ని యధావిధిగా ముత్తారం మండలంలో కొనసాగిస్తున్నందుకు మంత్రివర్యులకు ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ సింగల్ విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు మరియు మాజీ జడ్పిటిసి సభ్యులు నాగినేని జగన్ మోహన్ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య ముత్తారం మండల కిసాన్ సెల్ అధ్యక్షులు గాదం శ్రీనివాస్ వారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# ధాన్యం కొనుగోలు పారదర్శకంగా కొనసాగించాలి

**-రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలి**
**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 10 :** ధాన్యం కొనుగోలు పారదర్శకంగా కొనసాగించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో రాబోయే యాసంగి 2024-25 యొక్క వరిధాన్యం కొనుగోలు సంబంధించిన సన్నద్ధతపై అదనపు కలెక్టర్ బి.ఎస్ లత తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమర్థవంతమైన ప్రణాళిక రూపొందించి, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోలు పారదర్శకంగా కొనసాగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాల ని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రతలు తీసుకొనే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. ఎస్. లత, వివిధ జిల్లా స్థాయి శాఖాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విపత్తులపై ఎన్డిఆర్ఎఫ్ అవగాహన సదస్సు



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఫిబ్రవరి 10 :** విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ టీం కమాండర్ ముకేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ మద్దిలేటి బృంద సభ్యులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో విపత్తు ఏర్పడినప్పుడు ప్రాథమిక చికిత్స, సీపీఆర్ పద్దతి తదితర వాటిపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీర్ సింగ్, ఎస్సై రాజు, సిహెచ్ఓ రాంమోహన్, ఆర్ఐ సురేష్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నవోదయ పాఠశాల తరలిచకుండా పోరాడుతాం

**-ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**చురకలు విలేకరి, ధర్మపురి, ఫిబ్రవరి 10 :** ధర్మపురి నియోజక వర్గంలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని, ఎక్కడికి తరలించకుండా తన శాయశక్తులా పోరాటం చేస్తామని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని ధర్మపురి మండలంలో 252 సర్వే నెంబర్ లో 30 ఎకరాల భూమి ఉంది నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. దానికి సంబంధించి నేరేళ్ళ వద్ద ఆ సర్వే నంబర్ లో పూర్తి స్థాయిలో మ్యాప్ తో సహా రాష్ట్ర విద్యశాఖకు పంపించామని కేంద్ర ప్రభుత్వం 18 నవోదయ స్కూల్ని మంజూరు చేయగా,దానికి సంబంధించి ధర్మపురి మండలం లోని నేరేళ్ల గ్రామంలో విద్యాలయ ఏర్పాటుకు మంజూరు ఇచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.కొత్త భవనం నిర్మాణం చేసేంత వరకు ధర్మపురిలోని ఎస్సీ హాస్టల్లోను వాడుకోవాలని నిర్ణయించమని,దానికి సంబంధించి నవోదయ విద్యాలయ అధికారులు కూడా వచ్చి చూసి,త్వరలో తరగతులు ప్రారంభం చేస్తారని పేర్కొన్నారు. నవోదయ విద్యాలయాన్ని ధర్మపురి నియోజకవర్గానికి మంజూరు చేసినందుకు కేంద్ర ప్రభుత్వానికి పీఎం మోడీకి ధన్యవాదాలు తెలిపారు. గత 10 రోజుల క్రితం ఎంపి అరవింద్ నవోదయ విద్యాలయాలన్ని పెద్దపెల్లి పార్లమెంట్ కు కాకుండా నిజామాబాద్ పార్లమెంట్ కు తరలించాలని ప్రయత్నం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేక రాశరన్నారు. జిల్లాకు ఒక కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేయగా ధర్మపురికి నవోదయ విద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం మంజూరి ఇచ్చిన తర్వాత కూడా దాన్ని తరలించాలని చూడటం ఎంత వరకు సమంజసం అని ఎంపీ అరవింద్ ను ప్రశ్నించారు.త్వరలో ఢిల్లీకి వెళ్లి నేరుగా ఎంపి అరవిందను, అదే విధంగా సంబంధిత నవోదయ శాఖ అధికారిని కలిసి వినతి పత్రాన్ని అందజేసామన్నారు. నవోదయ పాఠశాల ఏర్పాటు కోసం ఎటవంటి భేషజాలు లేకుండా ,దీనిపైన ప్రధాన మంత్రి కి లేఖ రాస్తాను సమయం దొరికితే తప్పకుండా ప్రధానమంత్రిని కలుస్తానని వివరించారు. తప్పకుండా కేంద్రం నుండి సానుకూలమైన స్పందన ఉంటుందని లేకపోతే వచ్చిన తర్వాత మా కార్యచరణ ప్రకటిస్తామన్నారు. నవోదయ విషయంలో ఎక్కడ వెనుకను తగ్గ ప్రసక్తే లేదని తెలిపారు.నవోదయ పాఠశాలను ధర్మపురి మండలంలో ఏర్పాటు చేసే వరకు అన్ని పార్టీలు కలిసి రావాలని కోరారు. నవోదయ పాఠశాల ధర్మపురి లో ఏర్పాటు చేయటం కోసం ఎంతటి పోరాటం అయిన చేస్తామన్నారు. పాశిగామ గ్రామం వద్ద ఒక ట్రామ సెంటర్ ను ఏర్పాటు చేయాలని కూడా ఇప్పటికే సంబంధిత శాఖ మంత్రి, ముఖ్యమంత్రి కలిసి వినతి పత్రాన్ని అందజేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంఘనబట్ల దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్,పట్టణ అధ్యక్షుడు చిపిరిశెట్టి రాజేశ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, నాయకులు చిలుముల లక్ష్మణ్, జక్కు రవీందర్, సింహారాజు ప్రసాద్,అప్పం తిరుపతి, కాసెట్టి రాజేశ్,తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్వి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత



**చురకలు విలేకరి, గొల్లపల్లి, ఫిబ్రవరి 10 :** భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి, పాదం తిరుపతి రూపొందించిన బిఆర్ఎస్ విద్యార్థి విభాగం క్యాలెండర్ ను సోమవారం జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర గొప్పదన్నారు. ప్రజల పక్షాన ఉంటూ ప్రశ్నించే గొంతుకుల లాగా విద్యార్థి నాయకులు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఓరుగంటి రమణ రావు, జగిత్యాల మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ ఆసిఫ్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.